## మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**

దుండిగల్, డిసెంబర్14: మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శనివారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలు/బస్తీల్లోని పలు సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## తాగునీటి చెరువుగా మారుస్తాం

చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ తదితరులు

మియాపూర్, డిసెంబరు 14 : డ్రైనేజీ నీటితో మురికి కూపంలా తయారైన చెరువును తాగునీటికి ఉపయోగపడేలా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతో పునరుద్ధరణకు పూనుకున్నట్లు తెలిపారు. మియాపూర్ డివిజన్‌లో నెక్స్టెస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా చేపడుతున్న గురునాథం సుందరీకరణ పనులను కార్పొరేటర్, బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు శ్రీకాంత్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు పరిసరాలను పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో లోకేశ్, రమేశ్, రాజేశ్, అనిల్, సుధాకర్, బాబు, నాగరాజు పాల్గొన్నారు.

## స్ట్రీట్‌లైట్ల సమస్యలు పరిష్కరించాలి

అల్లాపూర్, డిసెంబర్ 14 : డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో స్ట్రీట్ లైట్లు వెలుగకపోవడంతో అంధకారంలో మగ్గుతున్నాయని, సత్వరమే సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ సబీహాబేగం అధికారులను ఆదేశించారు. శనివారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్, సఫ్దార్‌నగర్‌లో విద్యుత్ సమస్యలు తెలుసుకునేందుకు విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. పలు ప్రాంతాల్లో నూతనంగా విద్యుత్ స్తంభాలు, కేబుళ్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చాలని స్థానికులు కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగం పెరిగిపోయి ట్రాన్స్‌ఫార్మర్ల పై ఎక్కువగా లోడ్ పడి తరచూ విద్యుత్‌కు అంతరాయం వాటిల్లుతుందన్నారు. ఈ క్రమంలో పాత ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్లు, అవసరం ఉన్న చోట స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాచేసేందుకు కృషి చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు.

# అన్ని వర్గాలకు బ్యాంకు సేవలు

బ్యాంక్ పూర్వ చైర్మన్ ఆంజనేయులును సత్కరిస్తున్న పలు కోఆపరేటివ్ బ్యాంక్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబర్ 14 : ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు పనిచేయాలని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మానం ఆంజనేయులు అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ శ్రీనివాసులు, తెలంగాణ ఫెడరేషన్ అధ్యక్షుడు వేమిరెడ్డి నరసింహారెడ్డి, ది సిటీజన్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రంగరాజు, మహేశ్ బ్యాంక్ చైర్మన్ బంగ్ రమేశ్‌కుమార్, విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వీ రామారావు, తెలంగాణ అర్బన్ బ్యాంక్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, నవ భారత్ బ్యాంక్ మాజీ ఎండీ పాండురంగారావు, బ్యాంక్ ప్రెసిడెంట్ చలసాని రాఘవేంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ సామాన్యులకు సేవలందిస్తుందని, సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు కృషి చేస్తుందన్నారు. రైతులు, కార్మికులు, సమాజంలోని అన్ని వర్గాలకు బ్యాంకు సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ వేదికపై మానం ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాలనీ ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్, బ్యాంక్ డైరెక్టర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

## ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన

బాలానగర్, డిసెంబర్ 14 : దుర్గా భవానీ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి భవానీనగర్‌లో శ్రీదుర్గా భవానీ మాతా ఆలయంలో జరిగిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలకు డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. బస్తీవాసులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం, యజ్ఞాలు, అభిషేకం తదితర కార్యక్రమాల్లో కార్పొరేటర్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాయకులు జంగయ్య, నరేందర్‌గౌడ్, నర్సింగ్, బల్వంత్‌రెడ్డి, యాదగిరి బస్తీవాసులు పాల్గొన్నారు.

## 19న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

దుండిగల్, డిసెంబర్ 14 : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ (కాసాని కబడ్డీ అకాడమీ) ప్రాంగణంలో జిల్లా స్థాయి జూనియర్ బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చంద్రహాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ 10వ తరగతి మెమోతో పాటు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో మధ్యాహ్నం 3 గంటలకు కాసాని కబడ్డీ అకాడమికి చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9908205333/7396749998లో సంప్రదించాలని సూచించారు.

## నేడు వైద్యశిబిరం

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 14 : కేపీహెచ్‌బీ కాలనీ శ్రీమంజు వైద్యశాల, శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కట్టా నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. నేడు కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్యా గ్రౌండ్‌లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. శ్రీమంజు వైద్యశాల డాక్టర్ల పర్యవేక్షణలో బీపీ, షుగర్, జనరల్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7777932772లో సంప్రదించాలని కోరారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులు.. పట్టించుకోండి సారు..

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 14 : కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో జనావాసాల మధ్య వంటశాలను ఏర్పాటు చేసి... నాన్‌వెజ్ వంటలు చేస్తుండటంతో.... ఘాటైన వాసనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ వంటశాలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో ఐదు సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఫిర్యాదుదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వివరాల్లోకి వెళితే... కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ ఎల్ఐజీ 16లో జి.శ్రీనివాస్‌రావు కుటుంబం నివసిస్తున్నది. పక్కనే ఎల్ఐజీ 15 ఇంటిని నరేష్ అనే వ్యక్తి కిరాయికి తీసుకుని వంటశాలను ఏర్పాటు చేసి... బిర్యాని, నాన్‌వెజ్ వంటలు చేస్తున్నాడు. దీంతో సమీపంలోని ఇండ్లలోకి ఘాటైన వాసనలు వస్తున్నాయని స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలాన్ని ఆక్రమించి షెడ్డును ఏర్పాటు చేశారని, జీహెచ్‌ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ కూడా తీసుకోలేదని, పక్కన ఉన్న ఇండ్ల నుంచి ఎన్‌వోసీ తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాకు అలర్జీ, ఆస్తమా లాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ఈ వంటశాలతో అనారోగ్యం పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యేడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ప్రజావాణిలో ఐదు సార్లు ఫిర్యాదు చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోలేదని వాపోయాడు. ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు వచ్చి తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని వెళ్లిపోతున్నారని, ఇప్పటికీ ఆ వంటశాలను తొలగించలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి అంతర్జాతీయ హస్తకళ ఉత్సవం

కొండాపూర్, డిసెంబర్ 14 : శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పారామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే అంతర్జాతీయ హస్తకళ ఉత్సవం డిసెంబర్ 15వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని శిల్పారామం ప్రత్యేక అధికారి జి. కిషన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిల్పారామం, భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, నేషనల్ జ్యూట్ బోర్డుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవం కొనసాగుతుందన్నారు. హస్తకళ స్టాల్స్‌తో పాటుగా ప్రతి రోజూ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శనివారం సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా డాక్టర్ వినీలరావు తన శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

## క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానం

దుండిగల్, డిసెంబర్ 14 : కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు నాయకులు శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్పసముదాయంలోని క్రీస్తు కృపప్రార్థన మందిరంలో జరుగనున్న క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. అనంతరం కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. వారి వెంట ప్రభాకర్‌రెడ్డి, పాస్టర్ జాషువా, సురేశ్, మహేశ్, చందు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందిస్తాం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, కార్పొరేటర్

శేరిలింగంపల్లి, డిసెంబర్ 14: గౌలిదొడ్డిలోని తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో భోజన మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గురుకుల మధ్యాహ్న భోజన మెనూను ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షత్రియ కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివాజీరాజు

శివాజీరాజును అభినందిస్తున్న ఆయా సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 14 : క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి ప్రాంతానికి చెందిన పొత్తూరి శివాజీరాజు ఏకగ్రీవంగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా తన నివాసంలో ఆయా సంఘాల ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాలు పరస్పరం సహకరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడడంతో పాటు యువత, మహిళలకు ఉపాధి నైపుణ్యాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు శివరాత్రి బాలయ్య, దుండిగల్ మండల అధ్యక్షుడు తిరుపతి, కొమ్మరాజుల కృష్ణంరాజు, ఓర్సు వెంకటేశ్, వెంకటేశ్, సంపత్, అశోక్, చిట్టిబాబు, కరుణాకర్, స్వామి, వెంకటేశ్, తిరుపతి పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన

ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 14 : విద్యార్థులకు చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్స్ వి.రాజేంద్రప్రసాద్, టి.ప్రమీలారాణి పేర్కొన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ ధర్మారెడ్డి కాలనీలోని ప్రతిభా విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో కాకతీయ సామ్రాజ్యం చరిత్ర, సంస్కృతిపై విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణతో నాటి ఆహార విహారాలు, వస్త్రాలు, గృహసముదాయాలు, వాహనాలు మొదలగు అంశాలపై ఇచ్చిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గీతాజయంతి

దుండిగల్, డిసెంబర్ 14 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ బోట్రీ స్కూల్‌లో శనివారం గీతాజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు శ్లోకపఠనం, క్విజ్, వక్తృత్వపోటీలు, కీర్తన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్కృత ప్రచారసమితి, విజ్ఞాన్ బోట్రీ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు సంస్కృత ప్రచార సమితి అధ్యక్షుడు పరవస్తు అనంతశేషావతారం ముఖ్యఅతిథిగా హాజరై భవద్గీత విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రామానుజాచార్యులు, మాధవరెడ్డి, విజ్ఞాన్ పాఠశాలల తెలుగు కో-ఆర్డినేటర్ వై.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

BEFORE THE SOLI ARBITRATER / ASST. REGISTRAR OF CHITS AT MAHABUBNAGAR
Arbitration case No 264 OF 2024
Between
SHRIRAM RAGHAVENDRA CHITS PVT. LTD., ...DISPUTANT/PETITIONET
And
V.Raju Naik and Others ...OPPONENTS
NOTICE
5. K.Kishan S/o K.Bhenikiya, Aged: Occ: L.F.L Head Master,O/o M.P.P. School at Anjaiah Nagar, Mandal-Parishath Quthbullapur, Medchel town. ...Opponents No .all
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P.Chit Fund Act. And Rules of 2008 against you and Others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No.7-5-108/2/A, Registration office, 1st Floor, Opp: Hidustaion Petrol Bank, Venkateshwara Colony, Mahabubnagar On **28-12-2024** at **11-30 A.M.** for your appearance in person or through an advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the claim will be decided ex-parte.
"BY THE ORDER OF THE ARBITRATOR"
Mahabubnagar
**ABDULKHADER** Advocate
H.No.4-2-16/6/H/2/5, Ramaiah Bowli
Mahabubnagar . Cell No.9849894232

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మియాపూర్ , డిసెంబరు 14: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలానగర్ మండల స్కూల్ బాయ్స్ 1లో కామన్ డైట్ ప్లాన్‌ను ఎమ్మార్వో జైస్వామితో కలిసి కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కామన్ డైట్ ప్లాన్‌ను అమలు ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. కాస్మోటిక్ ఛార్జీలను పెంచటం వల్ల మరింత వెసులుబాటు లభిస్తుందని శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

BEFORE THE SOLI ARBITRATER / ASST. REGISTRAR OF CHITS AT MAHABUBNAGAR
Arbitration case No 261 OF 2024
Between
SHRIRAM RAGHAVENDRA CHITS PVT. LTD., ...DISPUTANT/PETITIONET
And
B.Srinivasulu and Others ...OPPONENTS
NOTICE
3. S.Ramesh S/o S.Rangaiah , Aged: 32 years, Occ:Police Constable, P.C.No.8466, O/o Cyberabad Commissioner Office, Hydrabad. ...Opponents No .all
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P.Chit Fund Act. And Rules of 2008 against you and Others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No.7-5-108/2/A, Registration office, 1st Floor, Opp: Hidustaion Petrol Bank, Venkateshwara Colony, Mahabubnagar On **28-12-2024** at **11-30 A.M.** for your appearance in person or through an advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the claim will be decided ex-parte.
"BY THE ORDER OF THE ARBITRATOR"
Mahabubnagar
**ABDULKHADER** Advocate
H.No.4-2-16/6/H/2/5, Ramaiah Bowli
Mahabubnagar . Cell No.9849894232

## ఈఎస్ఐ డిస్పెన్సరీ ఎదుట రోగుల ఆందోళన

దుండిగల్,డిసెంబర్14: జీడిమెట్లలోని ఈఎస్ఐ డిస్పెన్సరీ ఎదుట శనివారం పలువురు రోగులు ఆందోళనకు దిగారు. వైద్యం కోసం రోజూ వందలాది మంది వస్తున్నప్పటికీ వైద్యులు, సిబ్బంది మాత్రం సమయపాలన పాటించడం లేదని రోగులు ఆరోపించారు. డాక్టర్లు సైతం నిత్యం రోగులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, మందులు సైతం లేవంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భోజన విరామ సమయంలో వైద్యుల కోసం దాదాపు 2 గంటలకు పైగా వేచి ఉండాల్సి వస్తోందని రోగులు వాపోయారు. ఈఎస్ఐ డిస్పెన్సరీలో సకాలంలో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి నిర్లక్ష్యపు వైద్యులు, సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు.

## వ్యక్తి అదృశ్యం

శ్రీఖర్ (ఫైల్)

కుత్బుల్లాపూర్, డిసెంబర్14: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లగా, అదృశ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొంపల్లి ప్రాంతానికి చెందిన నూకల శ్రీఖర్(34)కు మతిస్థిమితం సరిగాలేదు. ఈ నెల 13న ఉదయం 11.30 గంటలకు స్థానికంగా ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌రోడ్ నంబర్ 13, 14, 21లో ప్రారంభమైన సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థానికులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కాలనీ ప్రతినిధులు ఉన్నారు.

- మియాపూర్ , డిసెంబర్ 14

## సంక్రాంతి సంబురాల ఆహ్వాన పత్రిక విడుదల

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 14 : కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ మణికొండ ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి సంబురాలను విజయవంతం చేయాలని చైర్మన్ గూడూరు సత్యనారాయణ అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన సమావేశంలో సంక్రాంతి సంబురాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ మణికొండ, జంట నగరాల కమ్మ సేవా సంఘాల సంయుక్తాధ్వర్యంలో బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీ గ్రౌండ్‌లో జనవరి 5న సంక్రాంతి సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జంట నగరాల్లోని ప్రజలందరూ ఆహ్వానితులేనని, ఈ వేడుకల్లో భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జగదీశ్, సాయి బాబాచౌదరి, శివశంకర్ పాల్గొన్నారు.

## అలరించిన నృత్యార్చన

నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

మాదాపూర్, డిసెంబర్ 14: కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనావాహినిలో పద్మశ్రీ, శోభరాజు ఆధ్వర్యంలో శనివారం కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత విష్ణు సహస్రనామ, అన్నమయ్యపురం గురుస్తుతిని ఆలపించారు. శృతిలయ సంగీత కూచిపూడి నాట్యాల, పిఠాపురం సంస్థ గురువు ప్రవీణ విశ్వేశ్వరరావు వారి శిష్య బృందం కృతి, సంతోషి, ఎన్ఎస్ఎస్ కార్తిక, పి. రేష్మ, నళిని, స్వప్నిక, ఆకృతి, చంద్రిక, ప్రవల్లిక, ఉమాదేవి, సింధు, జాహ్నవి, కుందన, వరలి, నాగ అక్షయ సంయుక్తంగా గణేశ కౌతం, నారాయణతే నమో నమో, అలరులు కురియగా తదితర సంకీర్తనలకు నృత్యార్చన చేసి అలరించగా, పద్మశ్రీ, శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

## రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 14 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి. (కేజీ-రూపాయలలో).. టమాట 15, వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 20, కాకరకాయ 23, బీరకాయ 55, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 43, కాలీఫ్లవర్ 30, దొండ 35, చిక్కుడు 40, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 37, క్యాప్సికం 53, ఆలుగడ్డ 33, కీరా 35, దోసకాయ 16, సొరకాయ 20, పొట్లకాయ (1) 20, కందగడ్డ 55, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 49, చింతకాయ -, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 33, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 18 నుంచి 20, పచ్చి బఠాని 80, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 400, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.